www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 27 అక్టోబర్ 2024
5
ఏలూరు



జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒగా ఎంవి.రమణ

కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ఏలూరు/జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒగా నియమితులైన ఎంవి.రమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏలూరు చేరుకుని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను అభినందించారు. మంగళగిరిలోని సిసిఎల్ఎలో అసిస్టెంట్ సెక్రటరీగా పని చేసిన ఎంవి రమణ జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒగా బదిలీపై నియమితులయ్యారు.


కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ఆర్‌డిఒ

ఆయుధ డిపో అలజడి..!


గ్రామసభలో అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గిరిజనులు (ఫైల్‌ఫోటో)

- ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ వ్యాఖ్యలపై గిరిజనుల ఆగ్రహం
- నేవీ యుద్ధ సామగ్రి డిపోను గతంలోనే తీవ్రంగా వ్యతిరేకించిన గ్రామసభ
- మళ్లీ ఎంపీ ప్రకటనలపై జీలుగుమిల్లి మండలంలో తీవ్ర చర్చ
- గిరిజనులను బతకనీయరా అంటూ ఆవేదన
- పోలవరం నిర్వాసితులకు కాలనీలు నిర్మించి మళ్లీ గెంటివేతకు కుట్ర
- మరోసారి గ్రామసభ నిర్వహించి ఆమోదించుకునేందుకు కుతంత్రాలు?

గిరిజనులే టార్గెట్‌గా కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. గత ప్రభుత్వ హయాంలోనే నేవీ యుద్ధ సామగ్రి డిపోను వ్యతిరేకిస్తూ గ్రామసభ తీర్మానం చేసినా మళ్లీ ఆయుధ డిపో నిర్మాణానికి పావులు కదుపుతోంది. గెలిపించిన ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చేసిన వ్యాఖ్యలతో గిరిజనుల్లో తీవ్ర అలజడి నెలకొంది. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు పేరుతో కన్న తల్లిలాంటి ఊళ్లను వదిలి గిరిజన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పుడు ఏజెన్సీ ప్రాంతమైన జీలుగుమిల్లి మండలంలో గ్రామాలను లేకుండా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుతంత్రాలు పన్నుతున్నాయని గిరిజనులు మండిపడుతున్నారు. ఆయుధ డిపోపై ముందుకు సాగితే తాడోపేడో తేల్చుకుంటామంటూ గిరిజనులు హెచ్చరిస్తున్న పరిస్థితి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


ఏజెన్సీ ప్రాంతం జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ యుద్ధ సామగ్రి డిపో (నేవీ ఎమ్యూనేషన్ స్టోరేజీ) ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. వైసిపి ప్రభుత్వ హయాంలోనే యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుకు సన్నాహాలు సాగాయి. ప్రజాభిప్రాయం సేకరించకుండా భూముల సర్వే సైతం నిర్వహించింది. ఏజెన్సీ ప్రాంతాలకు రక్షణ కవచంలా ఉన్న పీసా చట్టాన్ని తుంగలో తొక్కి 2023 సెప్టెంబర్‌లోనే అప్పటి వైసిపి ప్రభుత్వం, కేంద్రంలోని మోడీ సర్కార్ ముందుకు సాగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను గ్రహించిన గిరిజనులు ఆయుధ డిపోను తీవ్రంగా వ్యతిరేకించారు. రోడ్డెక్కి ఆందోళనలు, ధర్నాలు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏదైనా చేయాలంటే గ్రామసభ నిర్వహించి, తీర్మానాలు చేస్తే తప్ప ముందుకు సాగడానికి వీలుండదు. అటువంటి ప్రక్రియ చేయకుండానే యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణ వివరాలు నేవీ ఆర్నమెంట్ డిపో విశాఖపట్నం చీఫ్ జనరల్ మేనేజర్ కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్‌కు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒకు, జీలుగుమిల్లి తహశీల్దార్‌కు ఆదేశాలు సైతం జారీ అయ్యాయి. జీలుగుమిల్లి మండలంలోని వంకవారిగూడెం, దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం, రమణక్కపేట, కోత సీమలవారిగూడెం గ్రామాల్లో యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచించారు. మొత్తం 1165.55 ఎకరాలు అవసరమున్నట్లు నేవీ అధికారుల నుంచి వచ్చిన లేఖలో పేర్కొన్నారు. దీనిలో రూ.27.19 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి, భూమికి భూమి కింద రూ.671.60 కోట్లు, మేజర్లు అయిన గిరిజన యువతకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌కు వచ్చిన ఉత్తర్వుల గురించి అక్కడి ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా చేసిన పరిస్థితి అప్పట్లో సాగింది.



భూసేకరణకు ఎవరూ గ్రామంలోకి రావొద్దని వంకవారిగూడెం గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అప్పట్లోనే రోడ్డెక్కి గిరిజనుల పోరాటం..

నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుపై ప్రభుత్వ కుట్రలు గ్రహించిన గిరిజనుల్లో అప్పట్లో పెద్దఎత్తున రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. వంకవారిగూడెం పంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభను అంతా తీవ్రంగా వ్యతిరేకించారు. మా గ్రామాల్లోకి వచ్చి ఎటువంటి సర్వేలు నిర్వహించొద్దంటూ హెచ్చరిస్తూ ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కూటమి ప్రభుత్వం మళ్లీ కుట్రలకు దిగుతోంది. ఏలూరు జిల్లా పరిధిలోని పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మొత్తం ఐదు మండలాల్లో ఏజెన్సీ ప్రాంతం విస్తరించి ఉంది. పోలవరం ప్రాజెక్టు దెబ్బకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని దాదాపు 105 గ్రామాలు కనుమరుగుకానున్నాయి. పోలవరం మండలంలోని 29 గ్రామాలను దూరంగా తరిమేశారు. ఇప్పుడు జీలుగుమిల్లి మండలంపై పడ్డారు. గిరిజనులు స్వేచ్ఛగా బతికే అవకాశం లేకుండా చేస్తున్నారు. మైదాన ప్రాంతంలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేస్తే భూమి కొనుగోలుకు ఎక్కువ ఖర్చవుతుందని ఏజెన్సీ ప్రాంతంపై కన్నేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఎక్కడైతే ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని చూస్తున్నారో వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో పోలవరం నిర్వాసితులకు కాలనీలు కట్టారు. పోలవరం మండలం వాడపల్లి గ్రామానికి చెందిన దాదాపు 70 కుటుంబాలను ఇక్కడ ఇళ్లు నిర్మించి తరలించారు. గిరిజనులకు భూమికి భూమి సైతం వంకవారిగూడెం పంచాయతీలో ఇచ్చారు. మళ్లీ ఇక్కడ నుంచి కూడా తరిమేయాలని చూడటం అత్యంత దారుణమని చెప్పొచ్చు. ఇప్పటికే కన్నతల్లి వంటి ఊళ్లను వదిలేసిన గిరిజనుల పట్ల ఎందుకింత కక్షగట్టారనే ప్రశ్నలకు ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాల్సి ఉంది. జీలుగుమిల్లి మండలంలో పోలవరం నిర్వాసితులకు సంబంధించి 17 కాలనీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడకు వేలాది కుటుంబాలు చేరుతున్నాయి. నేవీ ఆయుధ డిపో ఏర్పాటైతే విపరీతమైన ఆంక్షలు పెరిగి జీలుగుమిల్లి మండలంలో ఉన్న 12 పంచాయతీల పరిధిలోని 33 గ్రామాల ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. ఏజెన్సీలో నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, తమ ఓట్లతో గెలిచిన ఎంపీ, ఎంఎల్ఎ అందుకు కృషి చేయాలని గిరిజనులు కోరుతున్నారు. అందుకు విరుద్ధంగా ముందుకు సాగితే పోరాటం తప్పదని హెచ్చరిస్తున్నారు.


ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామసభ తీర్మానం

29న గ్రామసభ నిర్వహణకు ఉత్తర్వులు

వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ సామగ్రి డిపోకు సంబంధించి భూసేకరణ నిమిత్తం అభిప్రాయ సేకరణ కోసం ఈ నెల 29వ తేదీ మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శనివారం నోటీసులు జారీ చేశారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం తహశీల్దార్ అధ్యక్షతన ప్రారంభమవుతుందని తెలిపారు.

నేవీ ఆయుధ డిపో ప్రతిపాదన విరమించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో నిర్మించ తలపెట్టిన నేవీ ఆయుధ సామగ్రి డిపోను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న కేంద్ర నేవీ ఆయుధ సామగ్రి డిపోను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆయుధ డిపో ఏర్పాటుకుగాను భూసేకరణకు సన్నాహాలు చేశారు. రెండుసార్లు గ్రామసభలు ఏర్పాటు చేసినా ఇక్కడున్నటువంటి ప్రజలు అంతా ముక్తకంఠంతో దాన్ని వ్యతిరేకించారని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన 'స్పందన' కార్యక్రమంలో కూడా వ్యతిరేకిస్తున్నట్లు తీర్మానం అందజేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ విషయాన్ని తెరపైకి తీసుకువచ్చి ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటే లక్ష్యంగా పావులు కదుపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నేవీ ఆయుధ సామగ్రి డిపోను గిరిజన ప్రాంతంలో నిర్మించడం అంటే ప్రభుత్వం గిరిజనులకు వ్యతిరేకంగా పని చేయడమే అని విమర్శించారు. ఆయుధ సామగ్రి డిపో నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే రానున్న రోజుల్లో జన సమీకరణ చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, ఎస్.సీతారామయ్య, దావీదు, అప్పారావు పాల్గొన్నారు.

కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు

రిట్ పిటీషన్లపై సరైన కౌంటర్లు వేయాలి: కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పెండింగ్ కోర్టు కేసులపై ఆమె సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖల్లో పెండింగులో ఉన్న కోర్టు కేసులకు సంబంధించి పరిష్కారానికి ఎటువంటి జాప్యమూ లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖలకు సంబంధించి టైమ్ బాండ్ కేసులు, డైరెక్షన్స్, ధిక్కార, రిట్ పిటీషన్స్‌పై ఆయా శాఖలవారీగా సమీక్షించారు. రిట్ పిటీషన్లపై సరైన కౌంటర్లు ఫైల్ చేయాలన్నారు. కేసుల పరిష్కారంపై వారం వారం సమీక్షిస్తామన్నారు. రిట్ పిటీషన్స్‌లో కోర్టులు ఇచ్చిన ఆదేశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కోర్టు ధిక్కరణ నమోదయ్యే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి పరిస్థితి రాకుండా అధికారులు ముందుగానే తీసుకున్న చర్యలపై నివేదికను సదరు కోర్టుకు సమర్పించాలన్నారు. కోర్టు ధిక్కరణ కేసుల్లో ఎటువంటి జాప్యం లేకుండా వకాల్తా సమర్పించాలన్నారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఆర్‌డిఒలు అచ్యుత అంబరీష్, బి.వాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఆశ్రం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత బస్సు

28న ఎంఎల్ఎచే ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

'మన ఆశ్రం-మన ఆరోగ్యం' అనే నినాదంతో ఆశ్రం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏలూరు ప్రజల సౌకర్యార్థం ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆ ఆసుపత్రి సిఇఒ హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సును తంగెళ్లమూడిలో ఈ నెల 28న ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి: సిపిఎం

ఏలూరు అర్బన్: ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరిట ప్రజలపై రూ.6,072 కోట్ల భారాన్ని విధిస్తూ ఎపి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ధరల పెరుగుదల, మరోవైపు ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఇలా విద్యుత్ భారం మోపడం అమానుషమని పేర్కొన్నారు. ఏనాడో వాడిన కరెంటుకు ఏళ్ల గడిచిపోయాక అదనంగా ఛార్జీలు చెల్లించాలన్న ట్రూఅప్ విధానం మోసపూరితమైందని విమర్శించారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణల్లో దుర్మార్గమైన షరతుల్లో ఇది ముఖ్యమైనదని తెలిపారు. 2022-23లో వాడిన కరెంటుకు ఈ నవంబర్ నుండి 2026 జనవరి వరకు కొన్ని నెలల్లో యూనిట్‌కు దాదాపు 83 పైసల వరకూ అదనంగా చెల్లించాలని తాజా ఉత్తర్వులు ఉన్నాయని, ఇది విద్యుత్ వినియోగదార్లందరికీ కష్టమే కాదు, నిరుపేదలకు పెను భారం కూడా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారానికి వస్తే 'విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం', 'విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తాం' అని ఉమ్మడి మేనిఫెస్టోలో హామీలిచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తగ్గించడం సంగతలా ఉంచి ఇప్పుడు అమాంతం 44 శాతం పెంపుదలకు పూనుకోవడం దారుణమని పేర్కొన్నారు. తక్షణం ఛార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ప్రజలు మరో విద్యుత్ పోరాటానికి సిద్ధమవుతారని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గేదెల కోసం వెళ్తే..!

చెరువులో నీట మునిగి భార్యాభర్తలు దుర్మరణం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గేదెలను గట్టుపైకి తోలేందుకు చెరువులోకి దిగిన భార్యా భర్తలు ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందిన ఘటన మండలంలోని పోతిరెడ్డిపల్లిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పోతిరెడ్డిపల్లికి చెందిన కొండా రామారావు (45), ప్రశాంతి (35) దంపతులు కూలి పనులు చేసుకుని జీవిస్తుంటారు. వీరికి గేదెలు ఉన్నాయి. వాటిని నీటి కోసం శనివారం చెరువులోకి తోలారు. తర్వాత వాటిని పైకి తోలేందుకు తొలుత రామారావు చెరువులోకి దిగాడు. అయితే ప్రమాదవశాత్తూ నీట మునిగాడు. గట్టుపై నుంచి ఇది గమనించిన ప్రశాంతి అక్కడికి చేరుకుని రామారావును కాపాడే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆమె కూడా నీట మునిగి మృతి చెందింది. స్థానికులు రంగంలోకి దిగి వారిని గట్టుపైకి చేర్చారు. అయితే అప్పటికే వారు ఇరువురు మృతి చెందారు. వీరికి పిల్లలు లేరు. విషయం తెలుసుకున్న సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. తన కార్యాలయ ప్రత్యేక అధికారి ప్రకాశరావుతో పాటు టిడిపి నేత రొంగలి కృష్ణ తదితరులను వెంటనే ఘటనా స్థలానికి పంపి మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఆసుపత్రికి తరలించారు.


రామారావు, ప్రశాంతి మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

ఉత్తమ ఉపాధ్యాయుడు రాజశేఖర్

ఉద్యోగ విరమణ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - చింతలపూడి

ఉపాధ్యాయ వృత్తిలో 38 సంవత్సరాలుగా సేవలు అందించి ఉపాధ్యాయ వృత్తికి దాసరి రాజశేఖర్ వన్నె తెచ్చారని యుటిఎఫ్ జిల్లా నాయకులు పురేటి శ్రీనివాసరావు అన్నారు. చింతలపూడి మండలం ప్రగడవరంలో ఎంపిపి స్కూల్ వద్ద దాసరి రాజశేఖర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులుగా, మంచి గాయకునిగా, టివిలో ప్రదర్శన ఇచ్చి, అక్షర దీక్ష అవార్డు పొంది మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా కీర్తి పొందారని అన్నారు. ఎంపిపి రాంబాబు, యుటిఎఫ్ మండల శాఖ ఉపాధ్యాయులు, పిఆర్‌టియు శాఖ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రాజశేఖర్ దంపతులను సత్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఎంపీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు భారత ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి, గ్రామాల్లో, పట్టణాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జల జీవన్ మిషన్ పథకం ద్వారా నిధులు రాబట్టేందుకు, శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య

వేలేరుపాడు : ఎన్నో ఏళ్లుగా కడుపున పెట్టుకుని చూసుకున్న కన్నతల్లి లాంటి ఊరుని రాష్ట్ర ప్రయోజనాల కోసం సర్వం త్యాగం చేస్తున్న పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేయొద్దని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య తెలిపారు. మండలంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం సిపిఐ ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మన్నవకృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇంటి విలువల విషయంలో అవకతవకలు జరిగి నిర్వాసితులు నష్టపోతున్నారని, వెంటనే ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలన్నారు. మంజూరైన జాబితా నుంచి జగన్నాథపుర గ్రామానికి చెందిన 140 మంది పేర్లను తొలగించడానికి కారణాలు వెంటనే తెలపాలని డిమాండ్ చేశారు. ఒక్క గ్రామంలోనే ఇన్ని పేర్లు తొలగిస్తే మండల మొత్తం మీద ఎన్ని కుటుంబాలకు అన్యాయం జరుగుతుందోనన్నారు. నిర్వాసితుల జాబితాను వెంటనే బహిర్గతం చేసి వారికి అందిస్తున్న వివిధ ప్యాకేజీల గురించి తెలియజేయాలన్నారు. అనంతరం తహశీల్దార్ డివి.సత్యనారాయణకు నిర్వాసితుల సమస్యలను తెలియజేస్తూ, వాటిని పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, జిల్లా కార్యవర్గసభ్యులు సన్నేపల్లి సాయిబాబు, రామవరం సర్పంచి పిట్ట ప్రసాద్, ఎపిజిఎస్ జిల్లా కార్యదర్శి కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిస రాము, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యర్రా మధు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని శనివారం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో 23 ఎజెండా అంశాలు, 1 టేబుల్ ఎజెండాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ సేవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నుంచి పెద్ద చెరువు కళింగ వరకూ గ్రావిటీ పైపులైను ఏర్పాటు, 16వ వార్డు సచివాలయాలలో ప్రధాని నరేంద్ర మోడీ, ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పార్థసారథిల చిత్రపటాలను ఏర్పాటు చేసేందుకు రూ.1.71 లక్షల ఆమోదం పొందేందుకు కౌన్సిల్ ముందుంచారు. వాటర్ సప్లైలో భాగంగా సీతారామపురం, గణపవరం రా వాటర్ పంపింగ్ లైన్ వద్ద లీకుల మరమ్మత్తుల నిమిత్తం రూ.2.80 లక్షలు, మున్సిపల్ కమిషనర్ అధికారిక కార్యక్రమాలకు వినియోగించే కారు అద్దె, బృందావన్ మున్సిపల్ పార్కు పిచ్చిమొక్కలు తొలగించుటకు రూ.1.42 లక్షలు, శారదా నర్సింగ్ రోడ్డుకు సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం రూ.9 లక్షలు అంచనా వేశారు. రెండవ వార్డులో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ.3.75 లక్షల అంచనా, 32వ వార్డులో సీసీ కల్వర్టులు నిర్మించేందుకు రూ.1.05 లక్షల అంచనా, ఎల్ఇడి లైట్లు సప్లై, డెలివరీ చేసేందుకు రూ.4.98 లక్షల అంచనా, వాటర్ సప్లై మెటీరియల్స్ రూ.4.98 లక్షల అంచనా వేశారు. 22వ వార్డు సీసీ రోడ్డు రూ.86,082.46 కాంట్రాక్ట్, 32వ వార్డులో సీసీ కల్వర్టు నిర్మాణానికి రూ.57,449.25 కాంట్రాక్ట్, మూడు నెలలకు షోవెల్ ఆపరేటర్ సప్లై చేయు పని నిమిత్తం రూ.87,272.64 కాంట్రాక్ట్ పనుల మంజూరు, టేబుల్ ఎజెండాలోని కాపు కళ్యాణ మండపం నిర్మించేందుకు అనుమతి వంటి అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించి అనుమతించారు.

విద్యార్థుల నైపుణ్య శిక్షణకు ఒప్పందం

విద్యార్థులు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకునేలా శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జెయుకెటి నూజివీడుతో హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత ఐఎస్ఒ సర్టిఫైడ్, టిటిఎస్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ మధ్య అవగాహనా ఒప్పందం(ఎంఒయు) జరిగింది. దీనిలో భాగంగా మెటలర్జీ, ఇతర ఇంజనీరింగ్ విభాగం, టిటిఎస్ కంపెనీ మధ్య సహాయ సహకారాలను అందించుకోవడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. మెటలర్జీ ఇంజనీరింగ్ విభాగంలోని అధునాతనమైన మెషిన్స్‌ను పరిశ్రమల స్థాయిలో వినియోగించుకునేలా కృషిచేయడం, మెటలర్జీ ఇంజనీరింగ్ విద్యార్థులు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకునేలా శిక్షణ కల్పించడం, విద్యార్థులకు సమ్మర్ ఇంటర్‌షిప్ ప్రాజెక్ట్‌లను కల్పించడం తదితరమైన అంశాల పట్ల ఒక ఒప్పందం చేసుకున్నామని ఆర్‌జెయుకెటి నూజివీడు డైరెక్టర్ సండ్ర అమరేంద్ర కుమార్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక ప్రఖ్యాత విశ్వవిద్యాలయమైన ఆర్‌జెయుకెటి నూజివీడుతో ఎంఒయు చేసుకోవడం పట్ల టిటిఎస్ కంపెనీ డైరెక్టర్ వెంకట రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాబోయే మూడు సంవత్సరాలలో యూనివర్సిటీకీ, పరిశ్రమలకు మధ్య వారధిగా కృషి చేస్తూ, ఇద్దరికీ లబ్ధి చేకూరేలా టిటిఎస్ సర్వీసెస్ కంపెనీ కృషిచేస్తుందని తెలియజేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇన్స్టిట్యూట్-ఇండస్ట్రీ సహకారం పెంపొందేలా, తద్వారా కన్సల్టెన్సీ ప్రాజెక్ట్స్ అభివృద్ధి చేస్తూ, యూనివర్సిటీకి ఆదాయ వనరులను సమకూర్చేలాగా ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమంలో మెటలర్జీ విభాగం అధ్యాపకులు వీరశ్రీను, శివ, మధుసూదన్, శివకుమార్, టిటిఎస్ కంపెనీ అధికారిక ప్రతినిధులు పాల్గొన్నారు.

దోమల నివారణకు డ్రోన్ పరికరంతో స్ప్రే

మేయర్ నూర్జహాన్ పెదబాబు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దోమల కారణంగా నగర ప్రజలు అనారోగ్యపాలు కాకూడదనే ఉద్దేశంతో అధునాతన డ్రోన్ పరికరంతో స్ప్రేయింగ్ చేయించడం జరుగుతుందని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు నూతనంగా వచ్చిన డ్రోన్ పరికరాన్ని శనివారం ఉదయం స్థానిక 49వ డివిజన్ రామన్న కోనేరు ప్రాంతంలో మేయర్ నూర్జహాన్ పెదబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ భాను ప్రతాప్, నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను హరించే డెంగీ, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులకు కారణమైన దోమలను నివారించేందుకు ప్రభుత్వం అధునాతన టెక్నాలజీ కలిగిన డ్రోన్ స్ప్రేయింగ్ మిషన్‌ను ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు పంపారన్నారు. దోమల నివారణకు గతంలో మనుషుల ద్వారా స్ప్రే చేయడం జరిగేదని తెలిపారు. అయితే మనుషులు వెళ్లలేని ప్రదేశాల్లో దోమలు ఎక్కువగా పెరిగి, ఊరంతా వ్యాప్తి చెంది, ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తున్నాయన్నారు. ఏలూరు నగర పరిధిలో సుమారు 130 నుంచి 150 ఎకరాలు మనుషులు వెళ్లలేని ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆ ప్రాంతాల్లో డ్రోన్ స్ప్రేయింగ్ మిషన్ ఉపయోగించి, స్ప్రేయింగ్ చేసి దోమలను నివారిస్తున్నామన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య ఆదేశాలతో ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ తరపున పాలకవర్గం, కమిషనర్, ఇతర అధికారులు ప్రజల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా ప్రజలు కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, డిఇ రజాక్, ఎఇ సాయి, డిఎంహెచ్ఒ కార్యాలయానికి సంబంధించిన మలేరియా అధికారులు, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.


డ్రోన్ పరికరాన్ని ప్రారంభిస్తున్న మేయర్

ఆక్వా సాగు తీరు అభినందనీయం

గోపీనాథపట్నంలో త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాష్ట్రంలో ఆక్వా సాగు తీరు అభినందనీయమని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో శనివారం ఆక్వా ఉత్పత్తుల స్టాల్స్‌ను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో గవర్నర్ మాట్లాడుతూ త్రిపురలో ఎపిలో వలె పెద్ద చెరువుల్లో చేపలు, రొయ్యల సాగు అక్కడ సాధ్యం కాదన్నారు. త్రిపుర రైతులను ఆంధ్రా తీసుకుచ్చి సాగుపై మరింత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోనున్నామని చెప్పారు. ఇక్కడి రైతులు వినూత్న పద్ధతుల్లో చేపలు, రొయ్యల సాగు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు ఎంఎల్ఎ పి.ధర్మరాజు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, టిడిపి నాయకులు అక్కిన నాగమణి, గోపీనాథపట్నం సర్పంచి పుప్పకాయల విష్ణుమూర్తి, ఇన్‌ఛార్జి తహశీల్దారు పూర్ణచంద్రప్రసాద్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు సాయం

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ముసునూరు

సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రంలోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందిస్తున్నామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. పేదల ఆరోగ్యంలో ప్రముఖపాత్ర వహిస్తూ, ఆస్పత్రి ఖర్చులు భరిస్తూ.. అందరికీ మేలు కోరే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. శనివారం మండలంలోని పొలసనపల్లి గ్రామ వాస్తవ్యులైన చిన్ని రాజ్యలక్ష్మి రూ.31,377, గాజుల రంగమ్మ రూ.75 వేల చెక్కును అందించారు. టిడిపి ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, వారిని టిడిపి సభ్యులుగా చేర్పించేందుకు పార్టీ శ్రేణులు కృషిచేయాలని ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాజుల రాజేష్ బాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

29న రైతు సదస్సు

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలో ఈనెల 29వ తేదీన నిర్వహించే రైతు సదస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ కోరారు. మండలంలోని పూళ్ల, కురెళ్లగూడెం, భీమడోలు గ్రామాలలో శనివారం వారు కౌలురైతు సంఘం నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించి రైతులను కలిశారు. రైతు సదస్సు నిర్వహించవలసిన ఆవశ్యకత, ఇతర అంశాల గురించి వారితో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధరను పెంచాలని కోరారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా తలెత్తే సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా సమన్వయకర్త వెజ్జు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరిట ప్రజలపై రూ.6072 కోట్ల భారాన్ని విధిస్తూ ఎపి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో కన్వీనర్ ఆగ్లోల వెంకట కృష్ణారావులు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే ధరల పెరుగుదల, ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్ భారం మోపడం సరికాదన్నారు. వాడిన కరెంటుకు ఏళ్ల గడిచిపోయాక అదనంగా ఛార్జీలు చెల్లించాలన్న ఎఫ్‌పిపిసిఎ విధానం మోసపూరితమైందని తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసించాలని ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు.

ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను ఆపాలి

ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో అతిపెద్ద పరిశ్రమగా ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయకుండా ఆపవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే అన్నారు. ఈనెల 31న ఎఐటియుసి 105వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం ఆర్ఆర్ పేట ఎస్ఆర్‌టిఎ వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ ఎఐటియుసి పోరాట ఫలితంగా భారతదేశ కార్మికవర్గం, ఉద్యోగవర్గం 44 కేంద్ర కార్మిక చట్టాలను, అనేక రాయితీలను సాధించుకోవడం జరిగిందన్నారు. ఎఐటియుసి సాధించిన కార్మికచట్టాలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని ఆయన విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరిస్తే ఎన్‌డిఏ పార్టీలకు రాష్ట్ర ప్రజానీకం తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - ముసునూరు

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులను విచారణ పేరుతో పోలీసులే నీరుగారుస్తున్నారని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ ఆరోపించారు. ముసునూరు గ్రామానికి చెందిన మేడూరి నరేశ్ అనే దళితుడికి చెందిన భూమి బిసి కులానికి చెందిన వ్యక్తి ఆక్రమించడాన్ని చూసి దానిని అడ్డుకున్న మేడా నరేష్‌ను కుల పేరుతో దూషించి దౌర్జన్యం చేస్తే, అదేరోజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేశారని తెలిపారు. పోలీసులు 10 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకూ కేసు నమోదు చేయలేదని, ఇది ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసును నీరుగార్చడం కాదా అని ప్రశ్నించారు. సిపిఐ మండల నాయకులు వేముల బక్కయ్య ఉన్నారు.

పోలీసుల విధివిధానాలపై విద్యార్థులకు అవగాహనుండాలి

టి.నరసాపురం : పోలీసుల విధి విధానాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సాయిసూర్య పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరిగే పలు నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ అంటే ఎవరు, పోలీస్ స్టేషన్ ఎలా ఉంటుంది, డ్రైవ్ సెల్ ఏం చేస్తుంది అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో ఒక సంఘటన జరిగితే అధికారులకు ఏ ఏ నంబర్లకు ఫోన్ సమాచారం ఇవ్వాలి అనే అంశంపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.జయబాబు, ఎఎస్ఐ జయకుమార్, సాయిసూర్య పాఠశాల కరస్పాండెంట్ పవన్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో జోనల్ స్థాయి సైన్స్ ఫేర్

ద్వారకా తిరుమల : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో 28, 29 తేదీల్లో జోనల్ స్థాయి సైన్స్ ఫేర్ నిర్వహించబడుతుందని పాఠశాల ప్రిన్సిపల్ బెజవాడ రాణి తెలిపారు. రెండు రోజులు జరుగుతుందని విద్యార్థుల మేధస్సు గుర్తించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఆమె తెలిపారు.

యాప్ డౌన్లోడ్ పేరుతో భారీ మోసం

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల గ్రామస్తులు యాప్ డౌన్లోడ్ పేరుతో పెట్టుబడి పెట్టి సుమారు 150 మంది రూ.కోటి మేరా నష్టపోయిన సంఘటన చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఒక వ్యక్తి రూ.20వేల ఎంఎస్ఇ యాప్‌లో ఇన్వెస్ట్ చేస్తే వారికి రోజుకు రూ.750 అకౌంట్లో పడతాయని, అలాగే ఎవరినైనా రూ.20 వేలు కట్టించి చేర్పిస్తే కట్టించిన వారికి రూ.5 వేల వరకు కమిషన్ ఇచ్చే పద్ధతిలో నమ్మబలికి గ్రామంలో సుమారు 150 మంది వరకు కోటి రూపాయల మేరా చెల్లించినట్లు సమాచారం. ఈ యాప్ కేంద్రంగా మొదలైనట్టు సమాచారం. ఈ స్కీంలో చేరిన వారికి ప్రతి శుక్రవారం సొమ్ము విత్ డ్రా ద్వారా ఇస్తామని చెప్పడంతో చాలామంది సొమ్ములు చెల్లించారు. గత రెండు నెలలుగా జరుగుతున్న ఈ స్కీంలో కొంతమందికి సొమ్ములు వారాలపాటు విత్ డ్రాలు బాగానే జరిగాయి. కాగా గత రెండు వారాల నుంచి అకౌంట్లో పడిన సొమ్ము విత్ డ్రా కాకపోవడంతో బాధితులకు ఆందోళన మొదలైంది. ఎవరికి వారు వైస్ సెంటర్ ద్వారా ఈ స్కీమ్లో చేరి మోసపోయినట్లు తెలిసింది. ఎవరిని అడగాలో, ఎవరిని సంప్రదించాలో తెలియక బాధితులు అయోమయానికి గురవుతున్నారు. పోలీసుల్ని ఆశ్రయించాలా, లేక తమని జాయిన్ చేసిన వ్యక్తులను నిలదీయాలా అనే సందిగ్ధంలో బాధితులు కొట్టుమిట్టాడుతున్నారు. ఈ బాధితులకు ఏవిధంగా న్యాయం జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో వ్యక్తులు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

జాతీయ రహదారి బాదంపూడి వై జంక్షన్ వద్ద శనివారం రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. బాదంపూడికి చెందిన కోడి విచిత్రరావు(35) ద్విచక్రవాహనం మీద బాదంపూడి వై-జంక్షన్ దాటుతుండగా తణుకు నుంచి ఏలూరు వైపు వెళుతున్న వ్యాను ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయాలతో విచిత్రరావు సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ముసునూరు : నూజివీడు బైపాస్‌లో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీకొట్టడంతో మండలంలోని చింతలవల్లి గ్రామానికి చెందిన పల్లిపాము ద్రాక్షా(49) అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బైపాస్ రోడ్డులో హనుమాన్ జంక్షన్ వైపు నుంచి విస్సన్నపేట వైపు వెళుతున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టి వెళ్లిపోయినట్లు అనుమానిస్తున్నారు. సీసీ కెమెరాలు పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పల్లి పాము ప్రతాప్‌కు భార్య, పాప, బాబు కూరు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటన చేయక ముందే షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు పుణెం.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని పలు సచివాలయల వద్ద నిరసన తెలిపి సిబ్బందికి వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 30న కెఆర్ పురం ఐటిడిఎలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. నలుమూలలా ఉన్న గిరిజన నిరుద్యోగులు హాజరై ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పొట్ట కామరాజు, సహాయ కార్యదర్శి నారం శంకర్, ఆదివాసీ సంఘ నాయకులు దుర్గారావు, రాజు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : ఏజెన్సీ ఏరియాకి ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని ఆదివాసి సంక్షేమ పరిషత్, ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన వినతి పత్రాన్ని అందజేశారు. ఆదివాసి విద్యార్థి సంక్షేమ పరిషత్, మండల అధ్యక్షులు పోట్ల మోహన్ దొర, సంక్షేమ పరిషత్ అధ్యక్షులు సోడే సీతారామయ్య, సోడే కళ్యాణ్ బాబు, నిరుద్యోగ విద్యార్థులు కారం నవీన్, మిరియాల రాము, బంధం ముత్యాలరావు, బంధం లక్ష్మి నారాయణ, మేఘన రోజా, ఆదివాసీ యువత పాల్గొన్నారు.

సైన్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ముసునూరు

జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ వారు నిర్వహించు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీ పరీక్షలకు భారతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ కొండేటి శౌరీ మాస్టర్ అన్నారు. మండలకేంద్రమైన ముసునూరు భారతీయ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నుంచి ఎన్.భవాని స్వామి(8వ తరగతి), కె.నవ్య(9వ తరగతి), టి.శైలు(10వ తరగతి) అను విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ కొండేటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

శరవేగంగా వంట షెడ్డు నిర్మాణ పనులు

ముసునూరు: స్థానిక హైస్కూల్లో నూతనంగా నిర్మించబడుతున్న వంట షెడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు స్థానిక టిడిపి నాయకులు దేవినేని వరప్రసాద్ తెలిపారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, ఆ పాఠశాల పిల్లల సౌకర్యార్థం రూ.10 లక్షలతో వంట షెడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్టు చెప్పారు. దీనికి ఆర్థిక సహకారంతో ముసునూరు గ్రామానికి చెందిన ప్రస్తుతం హైదరాబాదులో నివాసముంటున్న దేవినేని వరప్రసాద్, రుక్మాభాయ్ వీరు ఇరువురూ కలిసి నిర్మాణానికి చేయూతనిస్తున్నట్లు ఆ పాఠశాల ఉపాధ్యాయులు గంగుల నాగేశ్వరావు తెలిపారు. త్వరలో నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథిచే ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు.

ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీలు

నూజివీడు టౌన్ : మండలంలోని యనమల గ్రామ పంచాయతీలో జిల్లా పరిషత్ హై స్కూల్‌ను, గ్రామ సచివాలయంను ఎంపిడిఒ రాఘవేందర్ నాథ్ ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పిల్లలకు నాణ్యతగా అందించాలని, తప్పనిసరిగా మెనూ పాటించాలని సూచించారు. స్కూల్‌కు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రహరీ గోడను నిర్మించాలని, ప్లాంటేషన్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటు ప్రతిపాదనలు పంపాలని ఎపిఒ సోమేశ్వరికి, ఇసి కిషోర్‌కు తెలియజేశారు. పిల్లలకు కాంపిటేటివ్ క్విజ్ మండల పరిషత్ నూజివీడు వారి ద్వారా నిర్వహించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలిపారు.

నేడు చెక్కపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

ముసునూరు : చెక్కపల్లిలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకుడు జంపాల సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చెక్కపల్లి గ్రామంలో స్థానిక హైస్కూలు ప్రాంగణంలో ఆయుర్వేదం, హోమియోపతి, ఫిజియోథెరపీ, మానసిక వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు అందజేస్తారన్నారు. జనరల్ మెడిసిన్, కంటి, ఎముకలు, కీళ్లు, చెవి, ముక్కు, గొంతు, దంతాలు, గుండె, క్యాన్సర్, ఊపిరితిత్తులు, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, స్త్రీ సంబంధిత వ్యాధులు, చర్మవ్యాధులు, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని, కావున మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసు కార్యాలయంలో 'ఓపెన్ హౌస్'

ఏలూరు స్పోర్ట్స్ : అమరవీరులను స్మరిస్తూ వారి కోసం చేసే ప్రతి పని వారికి మనం ఇచ్చే ఒక గౌరవంగా భావించాలని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. అమరవీరుల వారసులలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి వారు ప్రజలకు సేవలు అందించే సమయంలో వినియోగించే ఆయుధాలను, ఇతర వస్తువులను విద్యార్థులకు తెలియజేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ మైదానంలో శనివారం అమరవీరుల వారసువాలలో భాగంగా 'ఓపెన్ హౌస్' నిర్వహించారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

మేయర్ నూర్జహాన్ పెదబాబు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

టిడిపి ప్రభుత్వంలో ప్రతి ఒక్క హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిబ్బంది, ప్రయివేట్ సెప్టిక్ ట్యాంక్ సిబ్బందికి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్లో శనివారం పిపిఇ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ పెదబాబు, కమిషనర్ భాను ప్రతాప్ మాట్లాడుతూ ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య ఆదేశాలతో కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిబ్బంది, ప్రయివేట్ సెప్టిక్ ట్యాంక్ సిబ్బంది 62 మందికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా వచ్చిన పిపిఇ కిట్లను అందజేశామన్నారు. ఈ కిట్లలో చేతి గ్లౌజులు, ఫుల్ షూట్ డ్రెస్సు, గ్లౌజులు, హెల్మెట్, గ్యాస్ మాస్క్, కళ్లద్దాలు మొదలగునవి ఉంటాయన్నారు. వీరు చేసే పనుల ద్వారా వీరి ఆరోగ్యం శుభ్రంగా ఉండాలని, ఆరోగ్య భద్రత కోసం వారి ఒంటికి మలినాలు అంటకుండా ఉండాలని, డ్రెయినేజీల ద్వారా వెదజల్లే విషవాయువు నుంచి రక్షణగా పిపిఇ కిట్లు ఉపయోగపడతాయన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా వీరికి రూ.5 లక్షల ఎలిజిబులిటీ గల ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులను అందించారు. రోడ్ల మీద చెత్త కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకుంటూ తిరిగే వారిని కూడా గుర్తించి వారికి హెల్త్ కార్డు ఇన్సూరెన్స్ వర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మేయర్ నూర్జహాన్ పెదబాబు తెలిపారు. అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, డిఇ రజాక్, ఎఇ సాయి, కార్పొరేటర్లు దేవరకొండ శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యులు కొల్లేపల్లి రాజు, జాల సుమతి, బాలాజీ పాల్గొన్నారు.

ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు

ద్వారకా తిరుమల : యుటిఎఫ్ గత 50 సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు ఎన్నో సౌకర్యాలు కలుగజేయడంలో ముందు వరుసలో నిలబడిందని వక్తలు కొనియాడారు. మండలంలోని యుటిఎఫ్ భవన్ ద్వారకాతిరుమలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ స్వర్ణోత్సవాలు, నూతన కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్తఫా ఆలీ, రవికుమార్ పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు డి.సుబ్బారావు, పి.వెంకటరావు పాల్గొన్నారు. అనంతరం మహాసభలను ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన నూతన కౌన్సిల్ సమావేశంలో మండల శాఖ అధ్యక్షులుగా బి.జయరాజు, మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా కట్టా శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ గౌరవాధ్యక్షులుగా పి.వరప్రసాద్, సహాధ్యక్షులుగా పొడుదల రాంబాబు, మహిళా సహాధ్యక్షురాలుగా డి.తులసీ వరలక్ష్మి, కోశాధికారిగా కలకొండ చినబాబు, కార్యదర్శులుగా ఎం.జాన్సన్, పి.సారధి, కాలి శ్రీనివాసరావు, అప్పయ్య, జి.చిన్నకృష్ణ, బి.రవితేజ, కెవి.ఉమామహేశ్వరరావు, బాల సురేష్, పి.విజయలక్ష్మి, కె.బెన్ని, మండల శాఖ ఆడిటర్‌గా సిహెచ్.దేవదాసులను మండల కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రజిత

నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వాలు ప్రాధాన్యం

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

నైపుణ్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, ఐటిఐ కోర్సు పూర్తి అయిన వెంటనే ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో ఉద్యోగాలు వెంటనే వస్తున్నాయని జిల్లా ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐ జిల్లా కన్వీనర్ పి.రజిత అన్నారు. పాసైన వారికి వెంటనే అప్రెంటిస్ షిప్ కల్పించడం జరుగుతుందన్నారు. ముదినేపల్లిలోని శ్రీపోలాకు అక్కయ్య మెమోరియల్ ఐటిఐలో 2024లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరాయపాలెంలోని గోవెల్ ఫీడ్స్ హృదయ హెచ్ఆర్.లింగారెడ్డి చౌదరి మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన వారికి అనేక పరిశ్రమలతో మంచి అవకాశాలు వస్తున్నాయని, కాబట్టి మంచి శిక్షణ తీసుకుని మంచి ఉద్యోగం, ఉపాధి పొందవలసినదిగా విద్యార్థులకు వివరించారు. అనంతరం ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ మెకానిక్ డీజిల్ ట్రేడ్‌లలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో 'కళాశాల ప్రిన్సిపల్ కూనపరెడ్డి సత్యనారాయణ, డైరెక్టర్ కుమారి కూనపరెడ్డి హరిత, అధ్యాపకులు ఒ.మణిభీమరాజు, బి.కృష్ణమోహన్, జిఎన్‌వి.శివ, వి.దుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఎల్‌ఇసి ఆమోదించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2019 మార్చి 1వ తేదీ తరువాత జరిగిన నియామకాలను డిఎల్‌ఇసి ఆమోదం తెలియజేయాలని, సంఘాల్లో హెచ్ఆర్ పాలసీ అంశాలు వర్తించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఎపి స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కెవి.సత్యనారాయణ అన్నారు. ఎపి స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా యూనిట్ మీటింగ్ శనివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఉద్యోగులకి మెడికల్ హెల్త్ ఇన్సూరెన్సు కార్డులు బ్రాంచి వారిగా జిల్లా అధ్యక్షులు కెవి.సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలకు రావాల్సిన పిఆర్‌సి కమిషన్ ఇవ్వకుండా సివిల్ సప్లయ్ అధికారులు కాలయాపన చేస్తున్నారని, డిసిసిబి వారు పిఎసిఎస్ సిబ్బందికి 25 శాతం ఉద్యోగాలు ఇవ్వకుండా 2 సంవత్సరాల నుంచి ఆలస్యం చేయుట గురించి చర్చించి రాబోయే రోజులలో ఉద్యమాల కోసం మరింత వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ మీటింగ్‌కి జనరల్ సెక్రటరి పి.సుబ్బారావు, కోశాధికారి వీరయ్య, గౌరవ అధ్యక్షులు డిఎన్‌విడి ప్రసాద్, స్టేట్ అధ్యక్షులు వెంకటరామయ్య, కార్యవర్గసభ్యులు హాజరైయ్యారు.

రాయితీపై కందిపప్పు, పంచదార

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో నవంబరు ఒకటో తేదీ నుంచి తెల్ల రేషన్‌కార్డుదారులకు ఉచిత బియ్యం, రాయితీపై పంచదార, కందిపప్పు పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు శనివారం తహశీల్దార్ సాయిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న 14,700 రేషన్ కార్డుదారులకు నూరుశాతం ఇవ్వనున్నట్లు తెలిపారు. 2,191 క్వింటాళు బియ్యం, 69.64 క్వింటాళ్లు పంచదార, 14,700 కిలోల కందిపప్పు రేషన్ సిద్ధం చేసినట్లు తెలిపారు. అరకిలో పంచదార రూ.17, కందిపప్పు కిలో రూ.67కు అమ్మకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెల్ల రేషన్‌కార్డుదారులు రేషన్ వాహనాల వద్ద రేషన్ తీసుకోవాలని సూచించారు.

పలుచోట్ల టిడిపి సభ్యత్వ నమోదు

భీమడోలు: టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు కోరారు. ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం గుండుగొలనులో ప్రారంభమైంది. తొలి సభ్యత్వాన్ని ఆ పార్టీ భీమడోలు శాఖ అధ్యక్షులు సిరిపత్తిన కొండబాబు స్వీకరించారు. దీనిని డిజిటల్ విధానంలో గన్ని వీరాంజనేయులు ప్రారంభించారు. వివిధ విభాగాల బాధ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

చింతలపూడి : గతంలో ప్రమాద బీమా రూ.2 లక్షలు ఉండగా ప్రస్తుతం రూ.5 లక్షలకు పెరిగిందని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ప్రగడవరంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకత్వాన్ని, కార్యకర్తలను చేరువ చేసేందుకు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్న పార్టీ టిడిపి అని అన్నారు. మాజీ ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, నాయకులు సూరనేని గోపినాథ్, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమమంటే పండుగ అని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పేర్కొన్నారు. ఏలూరులోని 50వ డివిజన్, 11వ డివిజన్‌లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటితో కలిసి పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. టిడిపి కార్యకర్తగా సభ్యత్వాన్ని నమోదు చేసుకున్న పలువురికి సభ్యత్వ కార్డులను అందజేశారు. టిడిపి నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, క్లస్టర్ ఇన్‌ఛార్జి అమరావతి అశోక్ పాల్గొన్నారు.

ముసునూరు: టిడిపి సభ్యత్వం రూ.100తో రూ.5 లక్షల ప్రమాద బీమా పొందవచ్చునని టిడిపి మండల నాయకులు దేవినేని ధలరామ్, గద్దె రఘుబాబులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. టిడిపి నాయకులు కొండేటి బాబి, నక్క యోహాన్, తోట శ్రీనివాసరావు, గార్లపాటి నరసింహారావు, పాకనాటి సీతారామాంజనేయులు, దేవినేని సాంబయ్య, నలిబోయిన రాంబాబు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ఎంఆర్ అప్పారావు కాలనీలో టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సదస్సును ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం కలిగి ఉండాలన్నారు. బీమా సౌకర్యం వర్తిస్తుందని తెలియజేశారు.

టి.నరసాపురం : టిడిపి సభ్యత్వాలు నమోదు పెంచే విధంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తిరుమలదేవిపేటలో శనివారం టిడిపి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శీలం వెంకటేశ్వరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణలు కలిసి ప్రారంభించారు. వార్డు సభ్యులు, టిడిపి గ్రామ అధ్యక్షులు పారెపల్లి బాబులు, కాల్నిడి వెంకటరత్నం పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని పలు గ్రామల్లో శనివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. మండలంలోని అల్లూరు గ్రామంలో తొలి సభ్యత్వం టిడిపి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దావు నాగరాజు తీసుకున్నారు.

పాస్‌పోర్టు పోయినది

తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ, సంజయ్ నగర్, డో.నెం.17-06-24కు చెందిన **తాటిపాక అరుణ, భర్త: తాటిపాక ఇస్సాకు** అను నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. **పాస్‌పోర్టు నెం. X4481885.** అనగా నాకు వివాహం అయ్యి నాభర్త గారు ఊరు అయిన సంజయ్ నగర్, కాకినాడలో ఉండే వారము. నాకు ముగ్గురు పిల్లలు. నాకు నా భర్తతో గొడవలు వచ్చి ది.13-08-2024 వ తేదీ నుండి నా మేనత్త అయిన కాళ్ళ మండలం, బొండాడపేట కాపురస్తులు చిత్తలూరి అమ్మాజి గారి ఇంటి వద్ద ఉంటున్నాను. నేను దుబాయ్ వెళ్లామని **X4481885** నెంబరు గల పాస్‌పోర్టు చేయించుకొని మా మేనత్త ఇంట్లో పెట్టియున్నాను. ది.03-10-2024వ తేదీన ఇంట్లో ఎవ్వరము లేము ది.09-10-2024వ తేదీన వచ్చి ఇల్లు చూసుకొనేసరికి ఇంట్లో ఉన్న బంగార వస్తువులు దానితోపాటు నాయొక్క **X4481885 నెంబరు గల ఒరిజినల్ పాస్‌పోర్టు దొంగిలించబడింది.** మేము కాళ్ళ పోలీసు స్టేషనులో రిపోర్టు ఇవ్వగా క్రైం నెం.229/2024 కేసు నమోదు చేసాము. కావున నేను వేరే పాస్‌పోర్టు చేయించుకొనుటకు ఎండార్స్‌మెంటు సర్టిఫికెట్ ఇవ్వవలసిందిగా కోరుచున్నాను.

దావా సమను ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జూడిషియల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో

O.S.No.116/2022

బిట్వీన్:
రేపాక విజయ శాంతి ...వాది
VS
గుండాబత్తుల రాజు ...ప్రతివాది

టు: గుండాబత్తుల రాజు, తండ్రి: రామారావు, డో.నెం.6ఎ-10-21, గుత్తుల వారి పేట, పాలకొల్లు, పాలకొల్లు మండలం, P.P.J.C.J.C. P.J.F.R.C.

పై నెంబరు దావాలో ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు పై నెంబరు దావాను ది.12-11-2024 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. కాబట్టి ప్రతివాది పై నెంబరు దావాలో **ది.12-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారు ఎదుట హాజరు కావలెను.** అట్లు హాజరు కానిచో ప్రతివాది పరోక్షమందు పై నెంబరు దావాను శ్రీ కోర్టు వారు తీర్మానించెదరని తెలియజేయమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కోదూరి వెంకటేశ్వరరావు
అడ్వకేట్, పాలకొల్లు.
పాలకొల్లు, 25-10-24. సెల్:9441750937

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 297/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) పితాని శ్రీను
D-2) వేముల సూర్యవంశీధర్ -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-2: వేముల సూర్యవంశీధర్, S/o. చంద్రశేఖరు, డోర్ నెం. 4-109, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 534258.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 28-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 341/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) కామన విజయ -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: కామన విజయ, D/o. పితాని సత్యనారాయణ, డోర్ నెం. 22-7, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 534258.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 28-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 345/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) పితాని దుర్గారావు
D-2) తొంటా జ్యోతిలక్ష్మి -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: పితాని దుర్గారావు, S/o. పెదకనకం, డోర్ నెం. 4-15, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 534258.

D-2: తొంటా జ్యోతిలక్ష్మి, W/o. శ్రీనివారావు, డోర్ నెం. 25-11-14/1, 14వ బ్లాక్, రామయ్య హాలు వీధి, పాలకొల్లు, ప॥గో॥జిల్లా, 534260.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 28-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 29/2024

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) పజ్జూరి శ్రీనివాసరావు
D-2) పజ్జూరి వీరమణి -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: పజ్జూరి శ్రీనివాసరావు, S/o. మల్లేశ్వరరావు, డోర్ నెం. 3-109, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 534258.

D-2: పజ్జూరి వీరమణి, W/o. శ్రీనివాసరావు, డోర్ నెం. 3-109,4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 534258.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 29-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 341/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్ -వాది

మరియు

D-1) పట్టిసపు సీతామహాలక్ష్మి -ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: పట్టిసపు సీతామహాలక్ష్మి, W/o. నాగరాజు, డోర్ నెం. 4-24, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 534258.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 28-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514